# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణా నది జల హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.**
2. **ఢిల్లీలో పర్యటిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పలువురు కేంద్ర మంత్రులతో ఈ రోజు సమావేశమైయ్యారు.**
3. **విశాఖపట్నంలోని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి సింహాచలం గిరి ప్రదక్షిణ రేపు జరగనుంది.**
4. **మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఈరోజు.**
5. **అనంతపురం జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం ఆయన హెలికాప్టర్‌లో శ్రీశైలం చేరుకుని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణా నదికి జల హారతి ఇచ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం సున్నిపెంటలో నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో సమావేశమవుతారు.

--------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్..33 సెకన్లు

అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తోతాపురి మామిడి ధరలు తగ్గడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని కేంద్రమంత్రికి వివరించామని చెప్పారు. మామిడి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం అవసరమని కేంద్రమంత్రిని కోరామని తెలిపారు.

--------------------------

విశాఖపట్నంలోని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారు కొలువు దీరిన సింహాచలం గిరి ప్రదక్షిణ రేపు జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి పుష్పరథంతో తొలి పావంచ వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధ రావు తెలిపారు. తొలి పావంచ నుండి అడవివరం, హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతాల మీదుగా సుమారు 37 కిలోమీటర్ల మేర ఈ గిరిప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. సుమారు ఐదు లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అంచనా వేస్తున్నామని, భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని విశాఖపట్నం పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలుపుతూ,

వాయిస్ 28 సెకన్లు

-----------------------------

మరోవైపు గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై రాష్ట్ర హోం మంత్రి వి. అనిత విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, స్వచ్ఛాలయాలు, తాగునీటి సదుపాయలతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇరుకైన రోడ్లు, ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా రద్దీని పర్యవేక్షించాలని హోంమంత్రి సూచించారు.

-----------------------------

నెల్లూరులోని బారాషాహీద్ దర్గాలో రొట్టెల పండుగ మూడవ రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవాన్ని ఈ రోజు నిర్వహించారు. కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి 12 బిందెలతో గంధాన్ని ఊరేగింపుగా బారాషాహిద్ దర్గా ఈద్గా వరకు తీసుకువచ్చారు. అక్కడ ప్రార్థనలు నిర్వహించి, పకీర్ల విన్యాసాల అనంతరం గంధం ఊరేగింపుగా దర్గాలోకి తీసుకువెళ్లారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బారాషాహిద్ సమాధులకు గంధాన్ని లేపనం చేశారు. గంధమహోత్సవాన్ని తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

-----------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులర్పించారు.

-----------------------------

శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల సమావేశంలో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన

మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంలో భాగంగా వివరించనున్నామని తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

అనంతపురం జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని ఉరవకొండ మండలం భూదగవి వద్ద ఈ తెల్లవారుఝామున జరిగిన జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. మృతులు తిరుపతి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని మృతులు మహారాష్ట్ర ఇలానాగర్ జిల్లా శివగామికి చెందిన వారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

---------------------------

ఒక జిల్లా – ఒక ఉత్పత్తి –ఓడిఓపి కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పలాస జీడిపప్పుకు 'జాతీయ స్థాయి ఉత్తమ పురస్కారం – 2025' లభించిందని అధికారులు తెలిపారు. ఈ నెల 14 వ తేదీన ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ అవార్డును అందుకోనున్నారని తెలిపారు. కాగా జాతీయ పురస్కారం రావడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు.ఇది శ్రీకాకుళం జిల్లాకే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రంగానికి ఈ పురస్కారం గొప్ప గుర్తింపు అని తెలిపారు.

---------------------------

ఉద్యానవన పంటల ద్వారా మహిళలు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ –డ్వామా ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఈ రోజు పాల్గొని మొక్కలు నాటారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు స్వల్ప లాభాలతో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 81 పాయింట్ల లాభంతో 83 వేల 520 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 10 పాయింట్ల లాభంతో 25 వేల 471 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

====================